క్లుప్తంగా

విత్తన శుద్ధితో మేలు


ఏఓ శారద

జి.సిగడాం: విత్తన శుద్ధి చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారి యర్రా శారద అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతులు పంట వేసే ముందు భూసార పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఇప్పటికే రైతులకు రాయితీతో కూడిన వరి విత్తనాలను సరఫరా చేస్తున్నామన్నారు.

అరటి పంటకు భారీ నష్టం


ఉల్లివలసలో నేలపాలైన అరటి పంట

జి.సిగడాం: ఇటీవల కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులతో అరటి పంట సాగు చేసిన రైతుల ఆశలు ఆవిరయ్యాయి. అరటి పంట సాగుచేసుకుంటే ఎకరాకు రూ.1.50 లక్షల వరకు ఆదాయం వస్తుందన్న ఆశతో సాగు చేస్తున్నారు. పంట చేతికివచ్చిన సమయంలో తీవ్ర నష్టం వాటిల్లింది. జాడ వెంకయ్యపేట, ఉల్లివలస, ఎల్లయ్యపేట గ్రామాల్లో సుమారుగా 40 ఎకరాలలో అరటి పంటకు నష్టం వాటిల్లింది. ఎకరాకు సుమారుగా రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పరిహారం అందించి ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

24 గంటల్లో తాగునీటి సమస్యలు పరిష్కారం


వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న ఏఈఈ

జి.సిగడాం: గ్రామాల్లోని ప్రజలకు సకాలంలో తాగునీరు సరఫరా చేస్తున్నామని రూరల్ డవలప్‌మెంట్ ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి అన్నారు. పాలఖండ్యాం, మద్రివలప, పెంట గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలను 24 గంటల్లో పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. మండలంలోని జల్ జీవన్ మిషన్ ద్వారా పలు గ్రామాల్లో తాగునీరును అందిస్తున్నామన్నారు. మరి కొన్ని గ్రామాల్లో బోర్లు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఏ గ్రామంలో అయినా తాగునీటి సమస్య ఉంటే తక్షణమే పరిష్కరిస్తామన్నారు.

పట్టపగలే వెలుగులు


వెలుగుతున్న విద్యుత్ వీధి దీపం

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో వీధి దీపాలు 24 గంటలూ వెలుగుతున్నాయి. సాయంత్రం ఆరు గంటలు నుంచి ఉదయం ఆరు గంటల వరకు వెలిగి ఉంటే చాలు. అలా కాకుండా విద్యుత్ దీపాలు నిరంతరం వెలుగుతూ విద్యుత్ దుర్వినియోగం అవుతుంది. మరో పక్క డైరెక్ట్ విద్యుత్ లైన్ల వల్ల సమస్యగా మారింది. వీధి దీపాలకు విద్యుత్ సరఫరా నిలిపే వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చేపల వేట ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: రెండు నెలల విరామం తరువాత మత్స్యకారులు ఆదివారం చేపల వేట ప్రారంభించారు. డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలెం పంచాయతీల పరిధిలోని మత్స్యకారులు ఉదయం వేటకువెళ్లారు. బోట్లు, వలలు మరమ్మతులు పూర్తిచేసి వేట సాగిస్తున్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం నుంచి తొగరాం వెళ్తున్న విద్యుత్ లైన్లను ఆదివారం విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతులు నిర్వహించారు. గత రెండు రోజులుగా ఈదురుగాలులకు లైన్లు దెబ్బతిన్నాయి. తీగెలు తెగటం, చెట్లు కొమ్మలు తీగెలపై పడటం వంటివి చోటుచేసుకున్నాయి. విద్యుత్ లైన్లను పరిశీలించి మరమ్మతులు చేశారు. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు మార్పుచేశారు. వర్షకాలంలో విద్యుత్ సరఫరాలో సమస్యలు లేకుండా లైన్లపై ప్రత్యేక దృష్టి పెట్టి అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలు తొలగించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలపై సైతం దృష్టి పెట్టి మరమ్మతులు చేపట్టారు.

పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ!


బలగలోని రిమ్స్ కూడలి వద్ద కర్రలను, రాళ్లను అడ్డుపెడుతూ ట్రాఫిక్‌ను నియంత్రించిన దృశ్యం


డేఅండ్‌నైట్ కూడలి వద్ద బారికెడ్లను ఏర్పాటు చేసి..

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం పట్టణంలోని పలు కూడళ్లలో పోలీసులు ఆదివారం వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. ప్రధాన మార్గాల్లోని రోడ్లకు ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడికతీత పనులను నగరపాలక సంస్థ సిబ్బంది చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. డేఅండ్‌నైట్, బలగ రిమ్స్ కూడళ్ల వద్ద వన్ వే పెడుతూ ట్రాఫిక్‌ను నిలువరించారు. ఇలిసిపురం రైతు బజారు నుంచి డేఅండ్‌నైట్ వరకు కాలువల్లో పూడిక తీసే క్రమంలో మట్టి రోడ్డుపై వేయడంతో వచ్చే పోయే వాహనాలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. అలాగే బలగ రిమ్స్ రోడ్డులో సైతం డ్రైనేజీ పనులు చేయడంతో కూడలి వద్ద కర్రలు, రాళ్లు అడ్డుపెట్టి ఒకవైపునుంచే వాహనాలు వదిలారు. డేఅండ్‌నైట్ కూడలి వద్ద బారికెడ్లు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూశారు.

ఎమ్మెల్యేను కలిసిన రేషన్ డిపో డీలర్లు


ఎమ్మెల్యే ఈశ్వరరావును అభినందిస్తున్న డీలర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలానికి చెందిన రేషన్ డిపోడీలర్లు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును బంటుపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కలిశారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. రేషన్ డిపో డీలర్లు సమస్యలు ఆయన వద్ద ప్రస్తావించారు.

భాగవతం ద్వారా భగవత్ తత్త్వం


నర్సింహమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: భాగవతం ద్వారా భగవంతుని తత్త్వం తెలుసుకోవాలని వక్త నిష్టల నర్సింహమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక ఉపనిషన్మందిరంలో భగవద్గీత–భాగవతం సమన్వయంపై వక్త ఉపన్యసించారు. భగవద్గీత భగవంతుని మాట అని, భాగవతం భవంతుని చేష్ట అని వివరించారు. ఈ రెండింటి మధ్య ఉన్న సంబంధాలను విశదీకరించారు. ముందుగా వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో మోహనరావు, మల్లేశ్వరరావు, నారాయణ మూర్తి, బాబూరావు, తవుడు, రవికుమార్, అన్నపూర్ణ, సరస్వతి పాల్గొన్నారు.

వేంకటేశ్వర కల్యాణోత్సవాలు ప్రారంభం


బ్యాంకర్స్‌కాలనీలోని శివబాలాజీ ఆలయంలో కల్యాణోత్సవం


చిన్నబజారులోని వేంకటేశ్వరస్వామికి కల్యాణ పూజలు


మొండేటివీధిలోని శివకామేశ్వరస్వామికి సహస్ర లింగార్చనలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు రేజేటి వేంకట శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మండపారాధనలు, ధ్వజారోహణం, మహానివేదన, నిరాజనం, మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ జరిగింది. సోమవారం ఏకాదశి సందర్భంగా స్వామివారి కల్యాణ వేడుకలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మాధవి, గీతా సత్సంగం సభ్యులు పాల్గొన్నారు.

శివబాలజీ ఆలయంలో..

బ్యాంకర్స్‌కాలనీలోని శివబాలాజీ ఆలయంలో అర్చకులు గోపినంబాళ్ల సీతారామాచార్యులు, ఆలయ కమిటీ సభ్యుల నేతృత్వంలో వేంకటేశ్వర స్వామి కల్యాణ ఉత్సవాలు ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా హోమాలు, విశ్వక్సేనారాధన, మండపారాధనలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు తులసీరావు, సామంత్, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సహస్ర లింగార్చనలు

మొండేటివీధిలోని లలీతాదేవి సహిత శివకామేశ్వర స్వామివారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా సహస్రలింగార్చనలు ఆదివారం జరిగాయి. షిర్డీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో శివకామేశ్వరునికి విశిష్ట సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేత


నగదు ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులు

గార: ఇటీవల విడుదలైన పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో మండలస్థాయిలో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు బీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహుమతులను ఆదివారం అందజేశారు. శ్రీకూర్మం జంక్షన్‌లోని కల్యాణ మంటపంలో ఫాదర్స్ డే సందర్భంగా బీవీఆర్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి తొమ్మిది మందికి నగదుతో పాటు పతకాలను అందజేశారు. ఫౌండర్ బలివాడ రేణుకదేవి, ప్రెసిడెండ్ బలివాడ దుర్గాప్రసాద్, జేసీసీ అధ్యక్షులు కర్రి అశోక్‌కుమార్, మండల శిష్టకరణ సంఘం గౌరవ అధ్యక్షులు బలివాడ రాధాకృష్ణ, హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఈఎస్ పట్నాయక్, విశ్రాంత హెచ్‌ఎం నవీన చంద్రుడు, పక్కి లోకనాథం, చౌదరి శ్రీనివాస్, బలివాడ ఉపేంద్ర పాల్గొన్నారు.

ఫ్రిడ్జ్ వితరణ


ఫ్రిడ్జ్‌ను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: భక్తుల దాహార్తిని తీర్చటం ఆనందాయకమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. నగరంలోని కలెక్టర్ బంగ్లా దారిలో గల సాయిగిరి బాబా ఆలయానికి క్లబ్ తరఫున భక్తుల సౌకర్యం కోసం ప్యూరిటీ కూలింగ్ ఫ్రిడ్జ్‌ను ఆదివారం వితరణ చేశారు. సాయిగిరి దేవస్థానానికి భక్తుల తాకిడి అధికమైందని, వారిని దృష్టిలో ఉంచుకొని, వారి సౌకర్యార్థం దేవస్థానం సభ్యులు గుత్తు చిన్నారావుకు ఫ్రిడ్జ్‌ను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, వైస్ ప్రెసిడెంట్ డి.విష్ణుమూర్తి, సభ్యులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, జోగి భారతి, ఉమాకవి, పి.చరణ్ ఉన్నారు.

ఘనంగా సత్యసాయి గ్రామసేవలు


అమృతకలశాల పంపిణీ చేస్తున్న అధ్యక్షులు రామచంద్రరావు


వృద్ధులకు గొడుగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు సూర రామచంద్ర రావు ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎంపిక చేసిన గ్రామాలలో కార్యక్రమాలు నిర్వహించామని రామచంద్రరావు తెలిపారు. వృద్ధులు, మహిళలకు ఉపయోగపడాలి అనే సేవా భావంతో ఉచిత డెంటల్, వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. బాలవికాస్ తరగతులు, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కల పెంపకం చేపట్టామన్నారు. భజనలు, సత్సంగములు, పల్లకీ సేవ, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, అమృతకలశాలు, గొడుగులు, పాదరక్షల పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో గ్రామసేవల ఇన్‌చార్జి రవీంద్రబాబు, రాష్ట్ర విద్యాజ్యోతి ఇన్‌చార్జి ఎస్.గురుప్రసాద్, డాక్టర్ తాతయ్య, డాక్టర్ కార్తీక్, జిల్లా సమన్వయకర్తలు అనాధి గుప్త, బోయిన నరసింహమూర్తి, పప్పల నాగేశ్వరరావు, శివకుమార్, అమ్మాయమ్మ, లలిత, శ్రీలక్ష్మి, జనార్దనరావు, కాశి, కిల్లాన శ్రీనివాసరావు, చంద్రశేఖర్, సాయి కృష్ణ, బాల వికాస్ గురువులు, చిన్నారులు, యువజన విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుకు అనుకూలం

ఎచ్చెర్ల క్యాంపస్: ఖరీఫ్‌లో వరిసాగుకు ముందు పచ్చిరొట్ట సాగుకు వాతావరణం అనుకూలంగా ఉందని మండల వ్యవసాయశాఖ అధికారి సురేష్ అన్నారు. ఎచ్చెర్లలో ఆయన ఆదివారం మాట్లాడారు. కట్టి జనుము, జీలుగు విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలో 40 కిట్వాళ్ల అమ్మకం పూర్తికాగా, మరో 20 క్వింటాళ్ల అమ్మకానికి సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. వరి సాగుకు ముందు పచ్చిరొట్ట సాగు చేయాలని, దమ్ము చేసి కుల్లబెట్టటం వల్ల నత్రజని, ఎరువుల వినియోగం మోతాదు తగ్గుతుందన్నారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న అమ్మవారు

ఎచ్చెర్ల: మండలంలోని దోమాం గ్రామంలో గల లలితాదేవికి సంకటహార చతుర్ధి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలాభిషేకం, పంచామృతం, కుంకుమపూజలు చేపట్టారు. దేవీ ఆశ్రమం అర్చకులు, వంశీకుమార్, ఆలయ ధర్మకర్త నరసింగారెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కాలభైరవస్వామికి హారతి


కాలభైరవస్వామికి హారతి ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో వేంచేసిన బాలాత్రిపుర కాలభైరవస్వామి పీఠం ఆలయంలో ఆదివారం సందర్భంగా కాలభైరవస్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం స్వామివారిని స్వర్ణాకర్షక భైరవ స్వామిగా అలంకరించి హారతి ఇచ్చారు.

ఘనంగా ధ్వజారోహణ


ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమా రుద్రకోటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఈశ్వరుని వాహనమైన నంది జెండాను అవరోహణ చేసి పూజలు చేశారు. సోమవారం శివపార్వతుల కల్యాణం, స్వామివారిని సర్పవాహనంపై ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌కు అభినందన


ఎమ్మెల్యే ఈశ్వరరావును కలిసిన రజక సంఘ నాయకులు

రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావును నియోజకవర్గం రజక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విజయనగరం పార్లమెంట్ రజక సాధికార కమిటీ కన్వీనర్ గురజాపు రాము ఆధ్వర్యంలో రజకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రజకులు అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. సంఘం నాయకులు సోపేటి రామారావు, జోన్నాడ భాస్కరరావు, శ్రీల సూరిబాబు, లక్ష్మి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పలు పోటీలు


చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని ధర్మశాస్తా ఆలయ ఆవరణలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు గేమ్స్, మోనో ఎక్షన్, మెమొరీ గేమ్ పోటీలు ఆదివారం జరిగాయి. గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులు అందించారు. చిన్నారి నందు రావన నృత్యంతో అలరించింది. కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్.నందికేశ్వర రావు, బి.ఎం.ఎస్.పట్నాయక్, నిక్కు హరిసత్యం, ప్రసాద్, ఎల్.దీప్తి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం


చెక్కును ఈవో చంద్రశేఖర్‌కు అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో అమలౌతున్న నిత్యాన్నదాన పథకానికి రెడ్డి కిల్లిపాలెం వ్యాస్తవ్యులు సింహాద్రి అప్పలరామేశ్వరం, కుమారుడు వెంకట రమణ మూర్తి, జ్యోతి దంపతులు రూ.1,00,116 విరాళంగా ఆదివారం అందజేశారు. తన తల్లి సింహాద్రి అప్పలనరసమ్మ జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేస్తున్నట్లుగా కుమారుడు రమణమూర్తి ప్రకటించారు. ఈమేరకు చెక్‌ను ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, రిటైర్డ్ ఇంజినీర్ నక్క శంకరరావు పాల్గొన్నారు.

శ్రీకూర్మనాథున్ని దర్శించుకున్న డీఎఫ్‌వోలు


డీఎఫ్‌వోలకు క్షేత్ర ప్రసాదాన్ని అందజేస్తున్న ఈవో గురునాథం

గార: కూర్మక్షేత్ర శ్రీకూర్మనాథున్ని శ్రీకాకుళం, మన్యం జిల్లాల డీఎఫ్‌వోలు వెంకటేష్, ప్రసూనలు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం లక్ష్మీసన్నిధి, తాబేళ్లపార్కు, రెండు ధ్వజస్తంభాలను సందర్శించారు. ఆలయ ఈవో జి.గురునాథం, కిషోర్‌బాబులు క్షేత్ర ప్రసాదాన్ని అందజేశారు.